# మేడిపండు

శ్రీకప్పాడి (కోడూరి)
కౌసల్యాదేవి



"మనం మరలా మిగిలిన విషయాలు వచ్చే శుక్రవారం సమావేశంలో చర్చించుదాం," అంటూన్న సెక్రెటరీ కమలను 'నోనో' అని వారించుతూ తాను లేచి నిలబడింది అధ్యక్షురాలు కోమలి.

"ఓ నెలరోజులు మన సమావేశాలు జరుగవు. నేను వూరు ప్రయాణం పెట్టుకున్నాను."

చాలామంది నిరుత్సాహంతో, మరి కొందరు ప్రశ్నార్థకంగానూ చూచారు.

"స్త్రీల ఆస్తి హక్కులను గురించి సమగ్రంగా చర్చించాలనుకున్నాం గదా మేడమ్?" సగం మాటలు మ్రింగేస్తూ అడగలేక అడిగింది శ్యామల అనే యువతి.

"ఔనౌను. గుర్తున్నది." బింకంగా అన్నది కోమలి.

"మీ ప్రయాణం తప్పనిసరా మేడమ్?" కమల గుటకలు మ్రింగుతూ అన్నది.

"అనే చెప్పాలి." గిరజాల జుట్టును ఒకసారి సుతారంగా సవరించుకుంటూ, మునివ్రేళ్ళతో చీర కుచ్చెళ్ళు సరిజేసుకుంటూ అంటూన్న కోమలిని తేరిపార జూచాను.

కోమలి అందగత్తె కాదు; అనాకారి కూడా కాదు.

కానీ అలంకరణలో మెలకువలు తెలిసినది; అన్ని సౌందర్య సాధనాలనూ అందుకోగల అంతస్థులోనిది; అలంకరణలోని నవ్యరీతులను నేర్చుకోగల ఓర్పు గలది. ఆఫీసరు భార్య గనుక అనుక్షణం లెఖ్ఖ పెట్టుకొంటూ తీరికలేకుండా గడపవలసిన అగత్యంలేదు. ఆమె ఇచ్చవచ్చినంత సేపు అలంకారానికి వెచ్చించగలది.

అందుకే అక్కడ సమావేశమైన నలభై ఇద్దరిలో నలుగురు మినహా అందరూ కోమలిని దేవతను చూచినట్టు చూస్తున్నారు.

"మేడమ్. మరలా సమావేశం ఎప్పుడని చెప్పమంటారు?"

'రామునిబంటు హనుమంతుడు' అని చదువుకోవడం గుర్తువస్తుంది కమల కోమలితో ఏదైనా మాట్లాడేప్పుడు కన్పరిచే వినయం చూస్తూంటే.

"చెప్తున్నా." హుందాగా ప్రారంభించింది కోమలి.

"మా అక్క కొడుకు పెళ్ళి, నేను వెళ్ళనిదే జరగదని చెప్పాలి. అందుకే వెళ్తున్నాను. తీరా వెళ్ళినతర్వాత ఎప్పుడొస్తాననీ చెప్పలేను. ఎందుకంటే అక్కచెల్లెళ్ళం, అన్నదమ్ములం— అందరం కల్సుకోవడం కదా? 'మా యింటికి రా' అంటే 'మా యింటికి ర'మ్మని అసలు వదిలి పెడతారా ఓ పట్టాన?"

"నిజమేనండి. ఔనండి మేడమ్." అంటూ అతి సంతోషపడిపోతూ గంగిరెద్దుల తలలలా ఆడిపోతున్నాయి కొందరి తలలు. అలా చొప్పదంటు ప్రశ్నలూ, సమాధానాలతోనే ఓ గంట గడిచింది. ఆ తర్వాత ఇద్దరు స్త్రీలు మినహా మిగిలిన అందరికీ తమ తమ యిళ్ళకు పోవటానికి అనుజ్ఞ ఒసంగబడింది కోమలిచేత.

"శ్యామలా! మంచి టిఫినూ, కాఫీ కావాలోయ్, చూడు రాక రాక నా స్నేహితురాలు వచ్చిందా మరీ?" అన్నది కోమలి.

"ఓ! ఒక్క పావుగంట మేడమ్."

"వంటవాడు చేస్తాడనుకో, కానీ నీ చేతి అమృతంలాగా వుండదుగదా? అంచేత వాడికి పైపని వొప్పజెప్పి నువ్వు పకోడీ, ఉప్మా తయారు చేయి.

అన్నట్టు....ముందుగా ఓ రెండు కప్పులు కాఫీ యిచ్చేదూ. చచ్చే తలనొప్పిగా వుంది."

"అలాగేనండి." పరుగెత్తినట్లే కోమలి వాళ్ల వంటింట్లోకి నడిచింది శ్యామల.

"చూడు రమా, మూడు నాలుగు పెద్దసైజు కేక్స్ తయారుచేయాలి, బంధువుల పిల్లల కివ్వటానికి. మాకు దార్లోకి భోజనం తయారవ్వాలి. అన్నీ నీకు తెలుసుగా? రేపు ఉదయమే వచ్చేసి నువ్వు పని మొదలు పెడితే, సాయంత్రం నా ప్రయాణం టైముకు అన్నీ 'ఫ్రెష్'గా వుంటాయి"

"అయ్యో. వేరే చెప్పాలా మేడమ్?" రమ అణకువగా అన్నది. "కానీ.... ప్రొద్దున్నే....పిల్లల్ని కొంచం తయారు చేసి స్కూళ్ళకు పంపాక రావచ్చునా మేడమ్?"

ఏదో మహాపరాధం చేస్తున్నంత భయంతో కనుగ్రుడ్లు నిలబెట్టేసి, వినీ-విన్పించనంత మెల్లని స్వరాన ఒక్కో-పదమే వుండీ వుండీ ఉచ్ఛరించింది రమ.

కోమలి వదనమూ, స్వరమూ గంభీరంగా మారిపోయాయి.

"పిల్లల్ని మీ ఆయన చూచుకుంటాడులే. రేపటికి ఆఫీసుకు పోనవసరం లేదు. అయ్యగారికి నేను చెప్తాలే."

రమ వదనం వికసించింది.

"అయితే యింకేమండీ? తెల్లారి లేస్తూనే వచ్చేస్తాను."

"మంచిది, వెళ్ళిరా."

శ్యామల కాఫీలు తెచ్చింది. ఇద్దరం తీసుకుంటూ మాటల్లో పడ్డాం.

"ఎవరు వాళ్ళంతా? ఇంట్లో పనులు కూడా చేస్తున్నారేమిటి?" నా మనసులోని సందేహాన్ని బయట పెట్టాను.

నన్నొక అజ్ఞానురాలిని చూచినట్లు చూడసాగింది కోమలి, సమాధానం చెప్పకుండా.

"లేడీస్ క్లబ్బూ, మెంబర్సూ అంటున్నావ్, మరి వాళ్ళలా యింట్లో పనులు కూడా ఎలా చేస్తున్నారబ్బా?"

ఫెళ్ళున నవ్వింది. అంతలో చికాకుగా భృకుటి ముడివైచింది.

"వీళ్ళంతా మా క్రిందివాళ్ళు!"

"అంటే?"

"ఓయి అమాయకురాలా! నువ్వు కథలెలా వ్రాస్తావో తెలియడంలేదు. మావారి ఆఫీసులోని మావారి క్రింది ఉద్యోగుల భార్యలు! ఇప్పుడర్థమైందనుకుంటాను?"

నేను విభ్రమంగా చూస్తూండిపోయాను—

నా మనసునందలి ప్రశ్నలను గ్రహించినట్లే చూచిన కోమలి మెల్లగా అన్నది;

"ఈ ప్రాజెక్టులో ఉద్యోగం మా ఆయనకు నా ఖర్మకొద్దీ వచ్చిందనుకుంటాను. పట్నానికి దూరంగా వెధవ జీవితం, తోచిచావదు."

"అదేం? నీరూ, కరెంటూ అన్ని సదుపాయాలూ వున్నాయిగా? వారం వారం మీకందరికి ప్రత్యేకంగా ఫిల్ముషోస్ వున్నాయి ఇక్కడే."

"ఆఁ,ఆఁ. లేకేం? అన్నీ వున్నాయి. శుభ్భంగా కార్లూ వున్నాయి భంయి భంయిన తిరగడానికి. ఎటొచ్చీ పోవటానికి చోటులేలేవు కానీ, వెధవది-అరవైమైళ్ళదూరం పట్నం పోవాలంటే"

"ఔననుకో," అన్నాను ఏమీ అనలేక, నా ప్రశ్నకూ ఈమె మాటలకూ ఏమి సంబంధమో తెలియటంలేదు.

"నీమట్టుకు నీవిషయమే చెప్పుపోనీ, నువ్వేమైనా సంతోషంగా వున్నావా ఇక్కడ? చదువుకొనేటప్పుడు ఎంత సంతోషంగా సరదాగా తిరిగే వాళ్ళమనీ?"

"నిజమే, కానీ అలా ఇప్పుడెలా వుండగలం? మనవాళ్ళ ఉద్యోగాలే అటువంటివికదా మరి?"

"ఔనౌను. వాళ్ళకి చక్కగా ఆఫీసు ఫైళ్ళలో ప్రొద్దుగడిచిపోతుంది. ఈ అడవిలో కాలక్షేపం కాక చచ్చేవాళ్ళం మనమే ఎటొచ్చీ. క్రిందటివారంనాలుగు సార్లు వెళ్ళాల్సివచ్చింది టౌనుకి పిక్చర్సు చూడ్డానికైతేనేం, షాపింగుకైతేనేం. 'ఆఫీసరుగారి భార్య గనక అంత దర్జాగా తిరుగుతోంది' అని చాటున ఏడుస్తున్నారట చాలామంది బ్రూట్స్. నా అదృష్టం వాళ్ళకెలా వస్తుంది, చిన్న చిన్న ఉద్యోగుల భార్యలకు?"

నేను మౌనంగా వింటున్నాను.

"వాళ్ళేం మాట్లాడుకున్నా-ఆఖరుకు మంచినీళ్ళు త్రాగినా నాకు తెలిసిపోతుందిలే. ఈ శ్యామలా, రమా, సీతా-వాళ్ళంతా నాకు ఎప్పటి విషయాలు అప్పుడు చెప్పేస్తారు."

"ఓహో!"

"ఒకామె అకౌంటెంటు భార్య. మిగిలినవాళ్ళు జూనియర్ ఇంజనీర్స్ భార్యలు. వాళ్ళ కష్టంమాత్రం నేనుంచుకుంటానా? మంచి యిక్రిమెంటులూ, ఓవర్టైములవీ బాగానే యిస్తాంగా?"

అంతలో నవ్వేస్తూ అన్నది;"ఇక్కడ యింటి పనిమనుషులు అంతగా దొరకరుగా? దొరికితే వాళ్ళనే పెట్టుకుందును. నాకేమో బొత్తిగా పనులుజేసే అలవాటు లేదు. ఖర్మకొద్దీ వచ్చింది మాకు ఈ ప్రాజెక్టు ఉద్యోగం."

లోలోన ఆశ్చర్యపడకుండా వుండలేకపోయాను.

అతి మామూలు కుటుంబంలో పుట్టిన కోమలి, ఇంటి పనిపాటలలో మునిగితేలుతూ, స్కూలుకు యించుమించుగా రోజూకూడా ఆలస్యంగా వచ్చి ఉపాధ్యాయుల మందలింపులు వినడం నాకు బాగా గుర్తున్నది.

పరిశుభ్రంగా వుండమనీ, శుభ్రమైన దుస్తులతో తరగతికి రావాలనీకూడా చీవాట్లువేసేవారు.

స్కూల్ ఫైనల్ పరీక్షఫీజు కట్టలేక బాధపడ్తూంటే, నేను మా యింట్లో తెలియకుండా ఆమె ఫీజుకూడా కట్టడం యింకా మరువలేదు.

'మరి? ఈ పూర్వాశ్రమ వివరాలన్నీ ఎరిగున్న నా దగ్గరనే ఇలా ఎలా మాట్లాడగలుగుతూన్నది?'

మాటలకు అంతరాయంగా ఎవరో వచ్చారు.

"ఓ! మిసెస్ కుమార్!"

ఆమె నమస్కారాన్ని అందుకుంటూ ఈమె దర్పంగా పలికిన మాటలవి.

కోమలి పిల్లలుకూడా స్కూలు నుంచి వచ్చారు.

వాళ్ళ స్నాన పాన ఉపాహారాదులు కనుక్కొన్నది మిసెస్ కుమార్. తర్వాత పిల్లలకు చదువు చెప్పటానికుపక్రమించింది ఎదుటి గదిలోనికి తీసుకెళ్ళి హోంవర్కులవీ పర్యవేక్షించుతూన్నది.

"పరీక్షలు దగ్గపరడ్తున్నాయి మిసెస్ కుమార్! ఈసారైనా 'రాంక్' రావాలి సుమా పిల్లలకు." హెచ్చరికగా అంటోంది కోమలి.

వినమ్రంగా తలవూపింది మిసెస్ కుమార్.

మరొకామె వచ్చింది.

నమస్కరించి, "నిన్ననే వచ్చానండి పుట్టింటినుంచి," అని చెప్పుకొంటూ చేతిలో పాకెట్టు విప్పి మరీ అందించింది కోమలికి.

"ఏమిటో?" అంటూ అందులోవున్న ఒక స్వెట్టరునూ, రెండు గౌన్లనూ తిరగా బోర్లావేసి చూచింది కోమలి.

"ఏదో శక్తికొద్దీ, పిల్లలకోసం. ఖాళీచేతులతో ఎలా రాగలనండి మరి?" నసిగింది.



"ఏమిటో మిసెస్ సింగ్. నీకు మా పిల్లలంటే ఎక్కడలేని అపేక్షానూ.... ఫర్వాలేదులే. రాత్రి వాడకానికి ఉపయోగిస్తాయి ఇవి," అని ప్రక్కన పెట్టింది ఆ బట్టలను.

మిసెస్ సింగ్ ప్రాణం తేలికపడ్డట్టుగా నిశ్వసించింది.

"వెళ్ళిరా."

అనుమతి లభించినా ఆమె కదల లేదు; నిలబడే వున్నది. ఆమె కనులలో ఏదో అభ్యర్థన.

అర్థమైనట్లుగా తల పంకించింది కోమలి.

"ఓ! మిస్టర్ సింగ్ విషయమేనా?"

"ఔనండి." చేతులు నలివేసుకుంటూ ఓ అడుగు ముందుకు వేసింది మిసెస్ సింగ్.

బహుశః కోమలి పాదాలను కళ్ళ కద్దుకోవటానికేమో ననుకున్నాను. కానీ అంతపని జరగలేదు;నే నున్నందు వల్ల కావచ్చు.

"ఏదో మీ దయ. ఋణం వుంచుకోను." ఇంకా ఆమె చేతులు నలిగిపోతూ నడుం అతివినయంతో వంగిపోతూ లేస్తూనే వున్నది. "వెళ్ళి రమ్మంటారా అమ్మగారూ?"

"ఆం. మంచి సమయంచూచి అయ్యగారికి చెప్తానులే. మళ్ళీ ఓ వారం రోజులు పోయాక కన్పించు. అదెంత? మా చేతిలోపని,తప్పకుండా చేయిస్తాలే."

వెళ్ళలేక వెళ్ళలేక నీరసంగా అడుగులు వేస్తూన్న మిసెస్ సింగ్‌ను చూస్తే జాలివేసింది.

'పాపం! భర్త నిరుద్యోగా? లేక 'ఊస్టింగ్', సస్పెన్షన్' వంటి బాధలలో గానీ వున్నాడా? లేనిదే అంత దీనంగా ఎందుకు వేడుకుంటుంది?'

"అన్నట్టు....మిసెస్ మణిని ఓసారి పంపించు. పనివుంది." అని ఓ కేక పెట్టింది.


మిసెస్ మణిని చూస్తూనే విరుచుకు పడింది కోమలి కోపంతో.

"నిన్నా, ఈ రోజూ అస్సలు కన్పించనేలేదు. ఏమిటి నీ సంగతి?"

"నిన్ననంతాజ్వరం అమ్మగారూ. ఈ రోజు తగ్గింది కానీ యింకా పథ్యం తినలేదు," అంటూన్న ఆమె కనులలో ఏదో బెదురు.

"అయితే మాత్రం? నాకు కాస్త కబురు తెలియజేయవద్దూ?"

"..............."




"నా ప్రయాణం రేపే, పిల్లల ప్రాకులు కట్టటం అయ్యిందా?"

"కొద్ది బాకీ వున్నదండి, నీరసం...."

"అవన్నీ ఎప్పుడూ వుండేవే కానీ, ఎలాగోలా పూర్తిచేసి రేపు ప్రొద్దున్న ఎనిమిదిగంటలకు తీసుకురా, కాస్త నాకు అవసరమైనప్పుడే జ్వరమూ రోగమూ అని సాకులు చెప్తే ఎలాగ?"

"లేదండి. ఎలాగో రాత్రి కూర్చుని పూర్తిచేసేస్తాను. మీ పనికి ఆటంకం కలుగనీయను. రేపు ప్రొద్దున్నే వచ్చి ఇక్కడ మీకు పనిసాయం చేస్తాను."

"సరే, సరే.... వెళ్ళిరా. అన్నట్టు.... మళ్ళీ చెప్పడం మరచిపోతాను—మేము లేనప్పుడు కాస్త రోజూ వచ్చి మాలీ చేత తోటపని చేయించు. ఓ వాన పడితే కానీ కూరపాదులవీ సరిగా నాటించు."

"అలాగే అమ్మగారూ."

"ఆఁ. వెళ్ళిరా. అన్నట్టు........ఆ క్రొత్తగా వచ్చిన మాథుర్-అసిస్టెంట్ ఇంజనీర్ లేడూ?"

"ఉన్నాడండి."

"వాడి భార్యకు కాస్త నాతో ఎలా మాట్లాడాలో తర్ఫీదు యియ్యి."

అర్థంకానట్లు గుడ్లు తేలవేసిందిమిసెస్ మణి. జ్వరం నీరసంతో వున్నదానిని కూర్చోమని కూడా అనడంలేదు కోమలి.

"ఉత్తరాది వైపునుండి వచ్చిందికదూ? మన భాష యింకా వచ్చివుండదు."

"చిత్తం."

"'మిసెస్ మూర్తీ', 'మిసెస్‌కోమలీ.' అని పిలుస్తోంది నన్ను, సమాన ఫాయిలో వున్నదానిలాగా. ఆ మగడి ఉద్యోగం నిలబడాలంటే కాస్త ఒళ్ళు దగ్గర పెట్టుకోవటం అవసరమని చెప్పు. 'మేమ్‌సాబ్' అని పిలవాలని చెప్పు నన్ను."

"అలాగేనండి. తప్పకుండా చెప్తానండి."

"ఊఁ. వెళ్ళు."

"రేపు ప్రొద్దున్న ఇడ్లీలు చేసి పంపమంటారా, మరేమైనా....?"

"ఆఁఆఁ, అవే పంపించు. కారప్పొడి కాస్త ఎక్కువగా పంపించు. నువ్వు చేసినవి చాలా బాగుంటాయంటారు పిల్లలు."

మిసెస్ మణి ముఖం విప్పారింది.

"మేము వచ్చేరోజుకూడా తెలియ జేస్తాం. టెలిగ్రాం యిప్పిస్తాను. ఇల్లంతా శుభ్రంచేయించి నీళ్ళూ, పాలూ, వగైరా అన్నీ సిద్ధంగా వుంచండి నీవూ, మిసెస్ సింగూ కలసి."

"అఁ అఁ, ఆ మాట వేరే చెప్పాలాండీ?"

ఎలాగైతే నిష్క్రమించింది.

ఇదంతా చూస్తున్న నాకు కాఫీ గొంతు దిగడంలేదు.

ఇప్పటికి కోమలి తీరికగా నావైపు చూసింది.

"ఈమె డ్రాఫ్ట్స్‌మన్ భార్య" అన్నది కోమలి.

"వెధవ ప్రాజెక్టు ఉద్యోగం. పని మనుషులు దొరికి చావరు," అన్నది తన ఉపన్యాసానికి ఉపోద్ఘాతంగా. నేను మాట్లాడలేదు.

"అన్నట్టు....నువ్వెలా లాక్కొస్తున్నావ్?" నన్ను ఎదురు ప్రశ్నించింది.

"ఏమిటి?"

"అదే-పనివాళ్ళ సమస్య...."


నేను నవ్వేశాను. "దొరికితే పెట్టుకోవడం. లేకుంటే చేసుకోవటం. మా వూరునుంచి కూడా ఇద్దరు ముగ్గురు మనుషులను తీసుకొచ్చాను. ఒకళ్ళూ నిలిచారుకాదు. దారి ఖర్చుల దండగైంది."

"తెలివితక్కువదానవు!" తాపీగా అన్నది కోమలి.

"నన్ను చూడు.... పనివాళ్ళులేనంత మాత్రాన పక్కదారులు లేవా? మణినీ, సింగునూ వచ్చేనెలలో జర్మనీ బ్రాంచ్‌కి పంపుతున్నాము. అక్కడినుండి బాగా డబ్బు సంపాదించి తెచ్చుకుంటారు. కుమార్‌కు త్వరత్వరగా రెండు ప్రమోషన్స్ యిప్పించాము అప్పుడే. నిరుడే జేరాడు ఉద్యోగంలో. శ్యామల భర్తపై ఏదో ఎంక్వైరీ వస్తే 'మాఫీ' చేయించాము.... అందుకే అందరూ వచ్చి అలా తలోపనీ అందుకుంటారు. వాళ్ళనూ మేము బాగానే ఆదుకుంటాము. అలా పబ్బం గడుపుకోవాలి కానీ మనం స్వయంగా పనులు చేసుకుంటామా ఇంతింత హోదాలలో వుండి?

'దానిని వెట్టిచాకిరీ అంటారా? అధికార మదం అనాలా?' అని ఆలోచనలో పడ్డాను నేను. కోమలి భర్త ప్రాజెక్టు మానేజరు. కాని ఆమే ఆ హోదాలో వున్నట్టుగా వున్నది ఆ గర్వమూ, ఆ మాటలతీరూ.

"ఏమిటోయ్ అలా చూస్తావ్? మన సొమ్మేం పోయింది చెప్పు? ఇంక్రి




మేంట్ల సొమ్ముకానీ, విదేశాలు పంపే సొమ్ము కానియ్ – అంతా కంపెనీ వాళ్ళదే. వాళ్ళూ ఏదో సంతోషిస్తారు పిల్లా పాపా గలవాళ్ళు. ఇటు మన పబ్బమూ గడచిపోతుంది."

"అత్త సొమ్ము అల్లుడు ధారబోసి నట్లు...."అని నవ్వలేక నవ్వాను.

"అలానే అనుకో. పొజిషన్‌లో వున్నప్పుడే అనుభవించాలోయ్. నేను ప్రాజెక్టు 'ఇన్‌ఛార్జ్' భార్యను!"

కోమలి భర్త వచ్చాడు ఆఫీసునుండి. వెంట అయిదారుగురు ఇంజనీర్లు. ప్రతి మాటకూ ముందూ చివరా తప్పనిసరిగా 'సార్' అనే సంబోధనను ఉపయోగించు తున్నారు!

త్రాగిన కాఫీ బయటకు కక్కేట్లుంది నా పరిస్థితి.

ఒక ఘట్టం చూశాను.

రెండో ఘట్టం చూడగల ఓపిక లేదు.

"వెళ్తాను మరి," అని లేచాను.

"మర్చేపోయాను. అసలు విషయం చెప్పనేలేదు," అన్నది సాగనంపుతూ కోమలి.

"ఏమిటో?"

"నేను వూరినుంచి వచ్చాక నీకు ఫోన్ చేస్తాను. మా మహిళామండలి వార్షికోత్సవానికి నిన్ను అధ్యక్షురాలిగా పిలవాలని...."

"అధ్యక్షురాలిగానా, అతిధినిగానా?"

"అదే ఏదో ఒకటిలే."

"నాకు వీలుపడదు కోమలీ, సారీ."

"పోవోయ్ మరీ బడాయ్! మీవంటి వాళ్ళే కలసిరాకపోతే యింకేం సాధించుతాం? స్త్రీల సమాన హక్కులను గురించి చర్చలూ, బాగా వాదించిన వారికి బహుమానాలూ, తర్వాత గ్రాండ్ పార్టీ అన్నీ వుంటాయి."

"........"

"ఏం మాట్లాడవ్? తప్పకుండా రావాలి."

"కోమలీ! ఒక్క మాట అడగనా? నవ్వేసింది. "భలేదానివే. అడుగు."

"కాస్త పైమెట్టు మీద నున్న నువ్వు నీ క్రింది స్త్రీలను నీతో సమానంగా చూడవు. అంతరాలు అహరహం గుర్తుంచు కుంటావు. మరి అనాది సంఘమూ, సమాజమూ, దైవమూ అందరూ కలసి అతడికి ఆపాదించిన ఆధిక్యతనూ, అధికారాన్ని పురుషుడు అంత తెలివిగా వదలుకోగలడా? అసాధ్యమైన దానికోసం ఎందుకు అనవసర కంఠశోషలూ, ఆర్భాటాలూ? మన నినాదాలు కేవలం మేడిపండ్ల చందం."

కోమలి ముఖం అమావాస్యనాటి అంబరమైంది. ముక్తసరిగా వీడ్కోలు వచనాలు పలికింది.

నాకు తెలుసు ఆనాటితోనే కోమలికీ, నాకూ మధ్య స్నేహం సరి అని.

కానీ ఆ శ్యామలా, మణీ వగైరా బృదం, ఎక్కడైనా కలసినపుడు – కోమలి ఎదురుగా లేకున్నా సరే 'అమ్మగారు' 'మా మేడమ్' అంటూ ఆమెగురించి మాట్లాడడం నన్ను ఆలోచింప జేసింది. 'బాంచను, కాల్మొక్త' అని తయారయ్యే వారుంటే మొక్కించు కునేవారికి చేదా?'

'నేను అనవసరంగా కోమలి స్నేహం విడనాడుకున్నానా?'

'అధికారంలో వున్నవాళ్ళు అధికారం చెలాయించుతారా! లేక క్రిందివారి నరనరాల్లో తరతరాలుగా జీర్ణించుకు పోయిన బానిసలక్షణాలు పైవారికి ఆ ప్రోద్బలతను కలిగించుతాయా?'